నమస్తే తెలంగాణ
# నల్లగొండ
5 | బుధవారం 20 డిసెంబర్ 2023 | NALGONDA

## యూజీ సెమిస్టర్ పరీక్షలు షురూ

### పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించిన అధికారులు




రామగిరి, డిసెంబర్ 19 : నల్లగొండ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహాత్మాగాంధీ యూనివర్సిటీ అనుబంధంగా ఉన్న కళాశాలల్లో డిగ్రీ సెమిస్టర్ 1, 5 పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆయా సెంటర్లలో పరీక్షల పనితీరును ఎంజీయూ పరీక్షల విభాగం అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. నల్లగొండలోని డీవీఎం బీఈడీ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని అసిస్టెంట్ పరీక్షల నియంత్రణాధికారి హరీశ్‌కుమార్ పరిశీలించి పలు సూచనలు చేశారు. కాగా, ఈ పరీక్షలు జనవరి 5న ముగియనున్నాయి.

# నేడు పోచంపల్లికి రాష్ట్రపతి ముర్ము

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము భూదాన్ పోచంపల్లిలో పర్యటించనున్నారు. శీతాకాల విడిదిలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చిన ఆమె బుధవారం పోచంపల్లికి రానున్నారు. పోచంపల్లి టై అండ్ డై, ఇక్కత్ చీరెలను తయారీని పరిశీలించనున్నారు. వివిధ అవార్డు గ్రహీతలు, నేత కార్మికులతో ప్రత్యేకంగా మాట్లాడనున్నారు. ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. వారం రోజులుగా ఏర్పాట్లలో తలమునకలైన కలెక్టర్ హన్మంతు, అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పోచంపల్లి పట్టణాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

- టై అండ్ డై, ఇక్కత్ చీరెల తయారీ పరిశీలన
- వినోబా బావే భవనం, టూరిజం సెంటర్ సందర్శన
- చేనేత వృత్తి, చీరె తయారీ విధానం, కార్మికుల స్థితిగతులపై ఆరా
- బాలాజీ ఫంక్షన్ హాల్‌లో వేదిక ఏర్పాటు
- ఎంపిక చేసిన అవార్డు గ్రహీతలతో ముఖాముఖి
- తెలంగాణ ఔన్నత్యం ప్రతిబింబించేలా ప్రదర్శనలు
- వివిధ రకాల చేనేత చీరెల స్టాళ్ల ఏర్పాటు
- అన్ని ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- పోలీసుల ఆధీనంలో పోచంపల్లి పట్టణం



రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో భూదాన్ పోచంపల్లిలో ముస్తాబవుతున్న వేదిక



యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : ప్రతి సంవత్సరం రాష్ట్రపతికి హైదరాబాద్‌లో శీతాకాలపు విడిది ఉంటుంది. ఈ ఏడాది కూడా రాష్ట్రపతి ముర్ము ఈ నెల 18న హైదరాబాద్ చేరుకున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని భూదాన్ పోచంపల్లిని ఆమె సందర్శించనున్నారు. ఉదయం 11.10 నుంచి మధ్యాహ్నం 12.10గంటల మధ్య రాష్ట్రపతి పర్యటన కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు. సుమారు గంట పాటు పట్టణంలో గడపనున్నారు. బుధవారం బేగంపేట విమానశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో రాష్ట్రపతి పోచంపల్లికి చేరుకుంటారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఆమెకు ఘన స్వాగతం పలుకనున్నారు. అక్కడి నుంచి రాష్ట్రపతి భారీ కాన్వాయ్‌తో పట్టణంలోని టూరిజం సెంటర్, ఆచార్య వినోబాబావే భవనానికి వెళ్తారు. భూదాన ఉద్యమకారులైన వినోబాబావే, వెదిరె రామచంద్రారెడ్డి విగ్రహాలకు నివాళులర్పిస్తారు. అనంతరం వినోబాబావే భవనంలో ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తారు.

**ఎంపిక చేసిన వారికే అనుమతి..**

ప్రభుత్వం సహకారంతో ఏర్పాటు చేసిన శ్రీరంజన్ సిల్క్ సెంటర్‌ను రాష్ట్రపతి సందర్శిస్తారు. ఇందులోనే దారం తయారీ నుంచి వస్త్రం

6వ పేజీలో

## సిల్క్ సిటీ.. మన పోచంపల్లి

- మగువలు మెచ్చే పట్టు చీరెలకు కేరాఫ్
- నిజాం కాలం నుంచే దేశ, విదేశాలకు ఎగుమతి

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 19 : ఒకప్పుడు అరబ్ దేశాలకు తేలియా రుమాళ్లు, గాజులు, పూసలను ఎగుమతి చేసిన హస్త కళా గ్రామం పోచంపల్లి. అదే ఇప్పుడు చేనేతలో కాటన్, పట్టు, సీకో వస్త్రాలకు పేరుగాంచింది. పోచంపల్లిని ప్రేమగా సిల్క్ సిటీ అని పిలుచుకుంటారు. నిజాం కాలంలోనే చెట్లు, పూల నుంచి తీసిన సహజమైన రంగులతో ఇక్కడి చేనేత కార్మికులు రుమాళ్లు తయారు చేసేవారు. వాటిని అరబ్ దేశాలకు ఎగుమతి చేసేవారు. అరవై ఏండ్ల కిందటే టై అండ్ డై పద్ధతిలో మగ్గాల

6వ పేజీలో

## ప్రభుత్వ విద్యార్థులకు రవాణా చార్జీలు

బస్సు సౌకర్యం లేని ప్రాంతాల నుంచి పాఠశాలలకు వచ్చే పిల్లలకు ఊరట

అర్హుల వివరాలు అందజేసిన విద్యాశాఖ

ఉమ్మడి జిల్లాలో 3,523 మంది విద్యార్థులకు లబ్ధి



గ్రామాల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు రవాణా భత్యాన్ని ప్రభుత్వం - విద్యాశాఖ అందిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంత మంది అర్హులు ఉన్నారో జిల్లా యంత్రాంగం లెక్క తేల్చి రాష్ట్ర విద్యాశాఖకు సమగ్రశిక్ష ద్వారా అందజేసింది. అలా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3,523 మంది విద్యార్థులకు ఊరట లభించనున్నది. ఈ నిధులను విద్యార్థుల వ్యక్తిగత ఖాతాల్లోకి నేరుగా జమ కానున్నాయి. 2023-24 విద్యా సంవత్సరం ప్రణాళికలను సైతం అధికారులు సిద్ధం చేసి సమర్పించారు.

రామగిరి, డిసెంబర్ 19 : బస్సు సౌకర్యం లేని ప్రాంతాల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే పేద విద్యార్థులకు రవాణా భత్యం అందిస్తున్నారు. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించిన నిధులను విడుదల చేసేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం అర్హులైన విద్యార్థుల జాబితాలను డీఈఓల ఆమోదంతో సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు రాష్ట్ర విద్యాశాఖ – సమగ్రశిక్షకు పంపించారు.

**ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రవాణా భత్యానికి అర్హత ఉన్న విద్యార్థులు**

| జిల్లా | మండలాలు | పాఠశాలలు | విద్యార్థులు |
|---|---|---|---|
| నల్లగొండ | 32 | 1,483 | 1,495 |
| సూర్యాపేట | 23 | 612 | 1,038 |
| యాదాద్రి | 17 | 575 | 1,236 |
| మొత్తం | 72 | 2,670 | 3,769 |

**రవాణా భత్యం అమలు ఇలా..**

రవాణా భత్యం నిధులను ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు వేర్వేరుగా అందిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.400, ప్రాథమికోన్నత, జడ్పీ పాఠశాలల విద్యార్థులకు రూ.600 చొప్పున చెల్లిస్తున్నారు. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇప్పటి వరకు ఆయా మండలాల ఎంఆర్‌సీల నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేసిన 3,523 మంది విద్యార్థులకు లబ్ధి కలుగనున్నది.

**నిబంధనల మేరకు అమలు చేస్తాం**



విద్యాశాఖ మంజూరు చేసే రవాణా భత్యానికి సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో అర్హత కలిగిన విద్యార్థుల వివరాలను సమగ్రశిక్ష ఆధ్వర్యంలో అధికారులు గుర్తించారు. 2022-23 విద్యా సంవత్సరం సంబంధించి అర్హుల జాబితాలను ప్రభుత్వానికి, విద్యాశాఖకు అందజేశాం. దానికి అనుగుణంగా వచ్చే విద్యా సంవత్సరం ప్రతిపాదనలు సైతం సిద్ధం చేస్తున్నారు. రవాణా చార్జీలకు సంబంధించి ఉత్తర్వులు అందగానే నిబంధనల మేరకు విద్యార్థులకు అందజేసేలా చర్యలు తీసుకుంటాం. నిధులను విద్యార్థుల వ్యక్తిగత అకౌంట్లలో జమ చేస్తాం.

– అశోక్, సూర్యాపేట డీఈఓ

## పునరావాస కేంద్రాల పనులు పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ, డిసెంబర్ 19 : జిల్లాలోని భూ సేకరణ, పునరావాస కేంద్రాల పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని నల్లగొండ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం రెవెన్యూ, భూసేకరణ, ఇంజినీరింగ్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కిష్టరాయపల్లి, శివన్నగూడెం, గొట్టిముక్కల, పెండ్లిపాకల, ఉదయ సముద్రం ప్రాజెక్టుల్లో జరుగుతున్న భూ సేకరణ పనుల ప్రగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి పునరావాసం, రీ సెటిల్మెంట్ వెంటనే చేయాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టులు, లిఫ్ట్ ఇరిగేషన్ తదితర పనులపై అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు రవి, దామోదర్, ఎస్‌డీసీ యూనిట్-1 ఆఫీసర్ లీల, స్పెషల్ కలెక్టర్ శ్రీదేవి, సూపరిండెంట్‌లు హేమలత, రాజశేఖర్ పాల్గొన్నారు.

## నేటి నుంచి డీఈఈ సెట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్

- డైట్ ప్రిన్సిపాల్ నర్సింహ

రామగిరి, డిసెంబర్ 19 : డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సులో ప్రవేశానికి నిర్వహించిన డీఈఈ సెట్-2023లో ఉత్తీర్ణులైన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన, వెబ్ కౌన్సెలింగ్ ఈ నెల 20 నుంచి ప్రారంభమవుతున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ కె.నర్సింహ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఈ నెల 22నుంచి 27వరకు కళాశాలల ఎంపికకు వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవాలని సూచించారు. వెబ్ ఆప్షన్ ఇచ్చిన వారికి ఈ నెల 30న సీట్ల కేటాయింపు జరుగుతుందని వెల్లడించారు. సీటు వచ్చిన విద్యార్థులు 2024 జనవరి 1నుంచి 3వ తేదీ వరకు కళాశాలల్లో ఫీజు చెల్లించాలని, జనవరి 5న కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించారు. జనవరి 8నుంచి విద్యా సంవత్సరం ప్రారంభమవుతుందని తెలిపారు.

## బాధితులకు భరోసా కల్పించాలి

ఫిర్యాదులపై వేగంగా స్పందించాలి

సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశం



సెట్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, డిసెంబర్ 19 : పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు, ఫిర్యాదుదారులకు భరోసా, నమ్మకాన్ని కల్పించడం పోలీసుల ప్రాథమిక విధి అని సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. పోలీస్ రిసెప్షన్ సెంటర్స్, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టం నిర్వహణపై మంగళవారం సెట్ కాన్ఫరెన్స్ ద్వారా పోలీసు అధికారులకు, సిబ్బందికి ఆయన సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులు, ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా ఉండాలని, పోలీసు శాఖ ప్రతిష్ట పెరిగేలా పని చేయాలని సూచించారు. సివిల్ తగాదాల్లో జోక్యం చేసుకోవద్దన్నారు. పోలీసు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రతి ఫిర్యాదుపై స్పందించి ప్రాథమిక విచారణ వేగంగా చేయాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును నమోదు చేయాలని, రసీదు ఇచ్చి పారదర్శకత చూపాలని అన్నారు. పిటిషన్ మేనేజ్‌మెంట్, రిసెప్షన్ సెంటర్ నిర్వహణపై జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఫీడ్ బ్యాక్ సేకరిస్తున్నామని చెప్పారు.

**ప్రతి సోమవారం పోలీస్ ప్రజావాణి**

బాధితుల ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపడానికి ప్రతి సోమవారం మధ్యాహ్నం 2:30గంటలకు జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించనున్నట్లు ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. సెంట్రల్ కంప్లయింట్ సెల్ ద్వారా జిల్లా పోలీసు కార్యాలయంలో 28 ఫిర్యాదులు పరిశీలించినట్లు తెలిపారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని, చట్టం ఉల్లంఘనకు పాల్పడి దాడులు చేసుకోవద్దని ప్రజలకు సూచించారు. సివిల్ తగాదాలు, భూ సమస్యలను కోర్టుల పర్యవేక్షణలో పరిష్కరించుకోవాలని కోరారు.




జడ్పీ సర్వ సభ్య సమావేశంలో పాల్గొన్న చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

## జిల్లా యూనిట్‌గా పంచాయతీ రాజ్, ఇరిగేషన్ శాఖలు ఉండాలి

- జడ్పీ సర్వసభ్య సమావేశంలో చైర్మన్ సందీప్ రెడ్డి

యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : పంచాయతీ రాజ్, ఇరిగేషన్ శాఖల పరిధి జిల్లా యూనిట్‌గా ఉండేలా చర్యలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి సూచించారు. మంగళవారం జడ్పీ హాల్‌లో ఆయన అధ్యక్షతన నిర్వహించి జిల్లా సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. మండల పరిషత్ సమావేశాలకు అధికారులు అందరూ తప్పకుండా హాజరు కావాలని, తద్వారా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం అవుతాయని అన్నారు. గ్రామాల్లో కుల సంఘ భవనాల నిర్మాణాల కోసం ఎన్నికల ముందు ప్రొసీడింగ్‌లు ఇచ్చారని, అసలు ఇప్పుడు అవి ఉన్నట్టా..? లేనట్టా..? అనే స్పష్టం చేయాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కోరారు. అడ్డగోలుగా ప్రొసీడింగ్‌లు ఇచ్చారని, వీటిపై సమీక్ష జరుపాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సైతం విజ్ఞప్తి చేశారు. పాత ప్రొసీడింగ్‌లు కొనసాగించాల్సిందేనని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో వంతెనల నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయని, అసలు నిధులు ఉన్నాయో, లేదో చెప్పాలన్నారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో సమావేశాన్ని ఒంటి గంటలోపే ముగించారు. కాగా ఎమ్మెల్యేగా గెలిచిన బీర్ల ఐలయ్య, కుంభం అనిల్ కుమార్ రెడ్డి తొలిసారి సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టర్ హన్మంతు కె. జెండగే, అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, జడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహస్వామికి నిత్యారాధనలు



ధనుర్మాసోత్సవంలో భాగంగా అమ్మవారికి హారతి ఇస్తున్న ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు

యాదగిరిగుట్ట, డిసెంబర్ 19 : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామివారి సన్నిధిలో స్వామి, అమ్మవార్లకు నిత్యారాధనలు శాస్త్రోక్తంగా జరిగాయి. మంగళవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం చేశారు. స్వామివారు నిజరూప దర్శనంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అనంతరం స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం వైభవంగా సాగింది. అనంతరం లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరుకల్యాణ తంతు జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణతంతును వీక్షించారు. ప్రధానాలయ ముఖమండపంలో శ్రీవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులు సువర్ణ పుష్పార్చనలు జరిపించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి, దర్బార్ సేవలు చేపట్టారు. రాత్రి స్వామివారికి తిరువరాధన చేపట్టి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామివారికి సహస్రనామార్చన జరిపారు. ఆంజనేయస్వామికి ఆకుపూజను ఘనంగా నిర్వహించారు. హనుమంతుడిని సింధూరంతో అలంకరించి అభిషేకించారు. తమలపాకులతో అర్చన చేపట్టారు. స్వామివారికి ఇష్టమైన వడపప్పు. బెల్లం, అరటి పండ్లను నైవేద్యంగా సమర్పించారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఉదయం 4:30 నుంచి 5:15 గంటల వరకు అర్చకులు వేదమంత్రాలు పఠిస్తూ అమ్మవార్లకు తిరుప్పావై పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ధనుర్మాస విశిష్టతను భక్తులకు వివరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు13 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.23,51,559 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ గీత, అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి తెలిపారు.

### అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు

సూర్యాపేట అర్బన్, డిసెంబర్ 19 : జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అతిథి అధ్యాపకులుగా పని చేసేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి క్రిష్ణయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేరేడుచర్ల ప్రభుత్వ కళాశాలలో ఏసీపీ ఒకేషనల్ కోర్సు బోధించేందుకు బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేసిన అభ్యర్థులు, నెమ్మికల్ కళాశాలలో కెమిస్ట్రీ బోధించేందుకు పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 23లోపు సంబంధిత అర్హత పత్రాలతో జిల్లా ఇంటర్మీడియట్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## యువత ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

జనవరి 22 వరకు దరఖాస్తుల స్వీకరణ

మిర్యాలగూడ ఆర్డీఓ చెన్నయ్య

6



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ చెన్నయ్య